# రహదారుల అభివృద్ధికి అరకొర నిధులు

- గోసాల-మద్దూరు రోడ్డుకు మోక్షమెప్పుడో?
- మద్దూరు-ఉప్పలూరు ఆర్అండ్బీ రోడ్డు దుస్థితి దయనీయం

కంకిపాడు: అభివృద్ధి మాటలు కోటలు దాటుతున్నాయి. కానీ నిధుల్లో మాత్రం కోతలు పడుతున్నాయి. రానున్న రోజుల్లో అభివృద్ధి వేగవంతంగా జరిగే ప్రాంతాలపైనా కూటమి ప్రభుత్వం ఎలాంటి ముందుచూపు లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అరకొరగా నిధులు కేటాయింపులు చేసి చేతులు దులుపుకోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రాధాన్యత మార్గాలపై పాలకుల నిర్లక్ష్యం**

విజయవాడ-దివిసీమ కరకట్ట నుంచి మద్దూరు, వణుకూరు, గోసాల మీదుగా ఈడుపుగల్లు, ఉప్పలూరు వద్ద కంకిపాడు-గన్నవరం ప్రధాన రహదారిని కలుపుతూ తొమ్మిది కిలో మీటర్ల మేర ఆర్అండ్బీ ప్రధాన రహదారి ఉంది. కరకట్టకు చేరుకోవాలన్నా.. గన్నవరం ఎయిర్పోర్టుకు చేరాలన్నా ట్రాఫిక్ అవరోధాలు లేకుండా గమ్యం చేరుకునేందుకు అత్యధిక భాగం వాహనచోదకులు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తారు. ఇంతటి ప్రాధాన్యత గల ఈ మార్గం అభివృద్ధి పట్ల పాలకులు నిర్లక్ష్యంగా



ఈడుపుగల్లు ప్రధాన రహదారి మార్గం

వ్యవహరిస్తున్నారు. ఉప్పలూరు-ఈడుపుగల్లు వరకు ఉన్న రోడ్డును తొలి విడతలో అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం ప్లాన్ వర్క్ కింద రూ. 3.50 కోట్లు మంజూరు చేసింది. గోసాల-మద్దూరు వరకూ ఉన్న రోడ్డు అభివృద్ధికి రూ. 6.50 కోట్లతో అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. అయితే దీనిపై ఇంకా స్పష్టత లేదు.

**గత ప్రభుత్వంలో రూ. 19.50కోట్లు కేటాయింపు**

ప్రజల అవసరాలు, ప్రాధాన్యతను గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్దూరు-ఉప్పలూరు రోడ్డు అభివృద్ధికి సీఆర్ఎఫ్ గ్రాంటు కింద రూ. 19.50కోట్లు నిధులు కేటాయించింది. ప్రస్తుతం సింగిల్ లైన్గా ఉన్న ఈ రోడ్డు డబుల్ లైన్గా అభివృద్ధి పరిచేలా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కేటాయింపులు చేసింది. రోడ్డు పనులకు శంకుస్థాపన కూడా జరిగింది. ఇంతలో ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సీఆర్ఎఫ్ కింద మంజూరైన పనులను రద్దుచేసింది. దీంతో ఈ రోడ్డు పనులు కూడా రద్దయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయింపులు చేస్తే ఆ పనులను కొనసాగించే యత్నం కూటమి సర్కారు చేయలేదు. అంతేకాకుండా ప్లాన్వర్క్ కింద రోడ్డు అభివృద్ధి పనులకు రెండు దశల్లో చేపట్టేలా నిర్ణయించింది. తొలి దశలో ఈడుపుగల్లు-ఉప్పలూరు రోడ్డుకు రూ. 3.50 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ప్రస్తుతం ఉన్న రోడ్డు (సింగిల్ లైన్) పనులను చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గోసాల-మద్దూరు పనులకు రూ. 6.50 కోట్లతో అంచనాలు ఉన్నాయి. కేటాయింపులు ఇంకా నోచుకోలేదు. ప్రాధాన్యతలను పట్టించుకోకుండా ఇదెక్కడి అరకొర కేటాయింపులు అంటూ ప్రజలు మండిపడుతున్నారు.

### ప్రమాదకరంగా ఉప్పలూరు-మద్దూరు రోడ్డు

ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఉప్పలూరు-మద్దూరు ప్రధాన రహదారి పరిస్థితి దయనీయంగా తయారైంది. దారిపొడవునా గోతులు, కోతకు గురైన మార్జిన్లతో రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. దీనికి తోడు ఈ మార్గం గుండా భారీ లోడుతో ఇసుక లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండటంతో ఇసుక జారిపోతుంది. దీంతో రోడ్డు మొత్తం ఇసుక నిండి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రిళ్లు అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని, రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు.

### అధ్వానంగా రోడ్డు



ఈడుపుగల్లు-ఉప్పలూరు రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. రూ. 3.50 కోట్లు నిధులు కేటాయింపులు జరిగాయి. ఈ వేసవిలోనే పనులు పూర్తి చేయాలి. వర్షాలు మొదలైతే రోడ్డు నాణ్యత కూడా ప్రశ్నార్థకం అవుతుంది. అధికారులు త్వరితగతిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి రోడ్డును అందుబాటులోకి తేవాలి.

చోరగుడి శ్రీకాంత్, ఈడుపుగల్లు

### నెలాఖరుకు టెండర్లు

తొలి దశలో ప్లాన్ వర్క్ కింద ఈడుపుగల్లు-ఉప్పలూరుకు రూ. 3.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తవుతుంది. వేగంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. అలాగే గోసాల-మద్దూరు రోడ్డు పనులకు నిధులు కేటాయింపులు జరగాల్సి ఉంది. సింగిల్ లైన్కే అనుమతులు వచ్చాయి.

మల్లికార్జున, ఏఈ ఆర్అండ్బీ, కంకిపాడు

## ముగిసిన శ్రీరంగమ్మ పేరంటాలు ఉత్సవాలు



అమ్మవారి ఉయ్యాల సేవ

గన్నవరం: ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో జరుగుతున్న శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవారి మహోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిశాయి. చివరి రోజున రాష్ట్రం నలుమూలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు ఎడ్లబండ్లపై కట్టిన ప్రభలతో ఊరేగింపుగా తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన అమ్మవారి ఉయ్యాల సేవను వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ కమిటీకి చెందిన జక్కా చంద్రశేఖర్, అజయ్, రమేష్లు పర్యవేక్షించారు. అమ్మవారి ఉత్సవాలు విజయవంతంగా జరగడానికి సహకరించిన పోలీస్, వివిధ శాఖల అధికారులకు ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

## క్లుప్తంగా

### ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్



హనుమాన్జంక్షన్ రూరల్: హనుమాన్జంక్షన్ శివారులోని శేరినరసన్నపాలెం రోడ్డులో నూతనంగా నిర్మించిన మెడి వ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సొంత ఊరిపై మమకారంతో పంచకర్ల కుటుంబం హనుమాన్జంక్షన్ లాంటి గ్రామీణ ప్రాంతంలో పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎస్పీ ఆర్.గంగాధరరావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావు, పలువురు వైద్యులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

### గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు

పెనమలూరు: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పెనమలూరు ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోసాల సాయినగర్ కాలువ కట్ట షేక్ బాజీ ఇంట్లో గంజాయి ఉందన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం దుప్పలవాడకు చెందిన కొర్ర చిన్నబ్బాయి విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో నాలుగు కేజీల గంజాయి రూ. 14 వేలకు కొన్నాడు. దానికి విక్రయించడానికి గోసాలకు తీసుకువచ్చి బాజీ, మరో మైనర్ బాలుడితో కలిసి కట్టలు కట్టి సంచుల్లో ఉంచారు. పోలీసుల తనిఖీలో బాజీ ఇంట్లో గంజాయి దొరకడంతో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

### అశోక్కు జనసేవ అవార్డు




పెనమలూరు: ఉత్తమ సేవలు అందించినందుకుగానూ కానూరుకు చెందిన మాతృహృదయ్ స్వచ్ఛంద సేవా సంఘ్, అశోక్ జిమ్ నిర్వాహకుడు తాళ్లూరి అశోక్కు జనసేవ అవార్డు ప్రదానం చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ జనసేవ అవార్డు ప్రదానం చేశారు. తాళ్లూరి అశోక్ అనేకసార్లు రక్తదానం చేశారు. బాడీ బిల్డింగ్ క్రీడారంగంలో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. అలాగే క్రీడాకారులకు సేవలందించిన బీ మనోహర్, అల్లూరిరెడ్డికి కూడా అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు.

### అన్నప్రసాద వితరణ

హనుమాన్జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. దాత గజ్జల సాంబశివరావు సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



కంకిపాడు: అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. పునాదిపాడు-2 సచివాలయంలో గ్రేడ్-5 సెక్రటరీగా పనిచేస్తున్న హర్షవర్ధన్ ఉద్యోగోన్నతిపై గ్రేడ్-4 సెక్రటరీగా బంటుమిల్లి మండలం ఆముదాలపల్లికి బదిలీ అయ్యారు. దీంతో సచివాలయంలో మంగళవారం హర్షవర్ధన్ను ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు అనుసంధానంగా ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పునాదిపాడు కార్యదర్శి బాపూజీ, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, వీఆర్ఓ నాగిరెడ్డి, ముసిబోయిన మోహనకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

హనుమాన్జంక్షన్ రూరల్: అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హనుమాన్జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జీఆర్ మోహనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అగ్నిమాపక సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక విజయవాడరోడ్డులోని ఉషోదయ సూపర్ బజార్, హెచ్ మార్ట్, రిలయన్స్ ట్రెండ్స్ వద్ద వినియోగదారులకు, ఆర్టీసీ బస్టాండ్లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు.

# అంగన్వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ కే కల్యాణి వర్మ అన్నారు. యనమలకుదురు గ్రామంలో మంగళవారం పౌష్టికాహారం పక్షోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో గృహాలను సందర్శించి వివరాలు తెలిపారు. గర్భిణులు, తల్లులు, చిన్నారులు పోషణ్ ట్రాకర్లో నమోదు చేసుకోవాలన్నారు. తల్లి తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకుని బిడ్డకు కూడా అందించాలని సూచించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉండి ఎదుగుతారని వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారంతో పాటు వైద్య సేవలు కూడా అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

**అంగన్వాడీ సేవలపై అవగాహన**

ఉయ్యూరు రూరల్: అంగన్వాడీ కేంద్రాల లబ్ధిదారులు పోషణ ట్రాకర్ను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ కంకిపాడు సూపర్వైజర్ బేబీ సరోజిని కోరారు. మండలంలోని కాటూరులో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా తల్లులకు అంగన్వాడీ కేంద్రం నుంచి అందిస్తున్న సేవలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బేబీ సరోజిని మాట్లాడుతూ గర్భిణులు వెయ్యి రోజుల పాటు తీసుకోవాల్సిన ఆహార ఆరోగ్య జాగ్రత్తల ప్రణాళికను తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రావణి, మహిళా సంరక్షణ కార్యదర్శి అనూష, అంగన్వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కాటూరులో పోషణ పక్షోత్సవాల్లో మాట్లాడుతున్న బేబీ సరోజిని



యనమలకుదురులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్వైజర్ కల్యాణి వర్మ

# పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్

గన్నవరం: క్రమశిక్షణ, పట్టుదలతో చదివే విద్యార్థులకు భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని వీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్లో ఉత్తమ ఫలితాలను సాధించిన 30 మంది కళాశాల విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్, అధ్యాపకులు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విజయవాడ నుంచి ఏలూరు మధ్యలో ఉన్న ఏకైక ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాల వీకేఆర్ విద్యార్థులు ఇంటర్మీడియెట్లో ఉత్తమ ఫలితాలను సాధించారని చెప్పారు. విద్యార్థుల అంకుటిత దీక్ష, అధ్యాపకుల కష్టం ఫలితంగానే ఇది సాధ్యమైందని తెలిపారు. అధ్యాపకులు తేజాకుమారి, ప్రమీల, దుర్గాభవాని, క్రాంతి, ఉషశ్రీ, జాషువా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరించిన అధ్యాపకులు

# ప్రభుత్వమే మినుములు కొనుగోలు చేయాలి

గన్నవరం: ప్రభుత్వమే అపరాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మినుములు క్వింటాల్ రూ. 10 వేలు చొప్పున కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు సూరగాని సాంబశివరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మినుము కొనుగోలు చేసే నాథుడు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకోలేక, చేసిన అప్పులు తీర్చలేక కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఇదే అదునుగా కమిషన్ వ్యాపారులు తక్కువ ధరకు మినుములు కొనుగోలు చేస్తూ దగా చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల నుంచి మినుములు కొనుగోలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూరగాని

## నేడు విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



హనుమాన్జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తుల కార్మాగారం 'ప్రాజెక్టు కామధేను' ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దాసాంజనేయస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్స్వామి పర్యవేక్షణలో మహాపూర్ణాహుతి, పుణ్యాహవాచనం, కుంభప్రోక్షణ తదితర హోమాలు జరుగుతాయని వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆంజనేయస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. గత మూడు రోజులుగా చిన్న జీయర్ స్వామి శిష్య బృందం నేతృత్వంలో దాసాంజనేయస్వామి ఆలయ ప్రతిష్టా పూజలు వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు.

## నేటి నుంచి జాతీయ స్థాయి నాటికల పోటీలు

విజయవాడ కల్చరల్: పీఎమ్కే ఫైన్ ఆర్ట్స్, ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర వాణిజ్యమండలి ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఐదు రోజులపాటు 44వ జాతీయ స్థాయి సాంఘిక నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు పసుపులేటి వెంకరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్లోని కందుకూరి కల్యాణ మండపంలో కార్యక్రమాలు ఉంటాయన్నారు.

# వివాదాస్పద స్థలంలో అన్న క్యాంటీన్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వంతెన సమీపంలోని వివాదాస్పద ఇరిగేషన్ స్థలంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి మంగళవారం రూరల్ మండల తహసీల్దార్ బీ సుగుణ స్థల పరిశీలనకు రావడం చర్చనీయాంశమైంది. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచన మేరకు ఈ పరిశీలన చేసినట్లు సమాచారం. రైవస్ కాలువ సమీపంలోని ఇరిగేషన్ స్థలంలో కొందరు స్వార్థపరులు శ్రీ కృష్ణుడి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణమంటూ ప్రభుత్వ, సంబంధిత అధికారుల అనుమతులతో పని లేకుండా ఆక్రమించడం వివాదాస్పదమైంది. పైగా ఈ స్థలంలో పాదచారులు, ద్విచక్రవాహనదారుల రాకపోకలకు ప్రత్యామ్నాయ రహదారంటూ హడావుడి చేస్తూ చదును చేయించడం కూడా రచ్చకెక్కింది. ఈ చర్యలపై పలువురు కోర్టుకు వెళ్లారు. ఇరిగేషన్ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేయరాదని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో మరల అక్కడ అన్న క్యాంటీన్ నిర్మాణమంటూ పరిశీలనకు రావడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్న క్యాంటీన్ నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని ఆ స్థలాల్లో నిర్మాణం చేస్తే అందరికి ఆమోదయోగ్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

# వికాస్ కళాశాలలో జాతీయ సదస్సు

నున్న(విజయవాడరూరల్): వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే నూతన సాంకేతిక ఆవిష్కరణల జాతీయ సదస్సు ఎన్సీశక్తి-2025 కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. నమీబియా యూనివర్సిటీ ఆచార్య కే వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణలు, రాకెట్లో వాడే నూతన సాంకేతిక విధానాలను సోదాహరణంగా వివరించారు. ఇటువంటి సదస్సులు నిర్వహించడం ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని అన్నారు. కన్వీనర్ డాక్టర్ పవన్సాయి సదస్సు గురించి వివరిస్తూ 177 పత్రాలను వివిధ కళాశాలలు, పరిశ్రమలకు చెందిన వారు సమర్పించారని తెలిపారు. వాటిలో 117 పత్రాలను ఆమోదించడం జరిగిందన్నారు. ప్రతి ఏటా ఇటువంటి సదస్సులను నిర్వహించి మంచి సాంకేతిక నిపుణులను తయారు చేయడం మా సంస్థ లక్ష్యమని వికాస్ విద్యాసంస్థల చైర్మన్ ఎన్ నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు పేర్కొన్నారు. డైరెక్టర్ ఎన్ కీర్తిరెడ్డి నూతన ఆవిష్కరణలను సమర్పించిన వారిని అభినందించారు. అనంతరం నూతన ఆవిష్కరణల బుక్ను ఆవిష్కరించారు.



నూతన ఆవిష్కరణల బుక్ను ఆవిష్కరిస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ తదితరులు

# భూసార పరీక్షతో నేలను కాపాడుకోవచ్చు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మనోహరరావు



మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**జిల్లా ఇన్చార్జ్ వ్యవసాయ శాఖ అధికారి మనోహరరావు**

ఉయ్యూరు రూరల్: భూసార పరీక్షతో నేలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కృష్ణాజిల్లా ఇన్చార్జ్ వ్యవసాయ శాఖ అధికారి మనోహరరావు పేర్కొన్నారు. మండలంలోని గండిగుంట రైతు సేవ కేంద్రంలో మంగళవారం పెనమలూరు, పమిడిముక్కల, ఉయ్యూరు మండలాల్లోని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు మట్టి నమూనా సేకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహరరావు మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని పంట పొలాల్లో మట్టి నమూనా సేకరించే విధంగా చూడాలని అన్నారు. అదేవిధంగా వేసవిలోని పంటలకు ఈ క్రాప్ బుకింగ్ మొదలైందని మార్చి, ఏప్రిల్లో నాటిన పంటలన్నీ కూడా పంట నమోదు అయ్యేలా చూడాలని చెప్పారు. పీఎండీఎస్(ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) నవధాన్యాల సాగు గురించి వివరించారు. అలాగే మట్టి నమూనా సేకరించే విధానాన్ని వివరించారు. ఈసారి మట్టి నమూనా పరీక్షలకు గుడివాడ కేంద్రానికి పంపాలని సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల నేలలోని పోషకాలు నశించి భూసారానికి, పర్యావరణానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఏ, డీఆర్సీ కే జ్యోతి రమణి, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం సునీల్, ఏపీసీఎం డీపీఎం పార్థసారథి, ఏడీఏ, డీఆర్ సీకే శ్రీనివాసరావు, ఏఓ డీఆర్సీబీ పద్మజ, ఏఓలు గణేష్రెడ్డి, బీ నిసిగ్రేస్, మూడు మండలాల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుద్ధ్యం

గండిగుంట సచివాలయం-2 వద్ద రహదారిపై చెత్తాచెదారం



మండలంలోని గండిగుంట గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్తాచెదారం గుట్టలు గుట్టలుగా పడి ఉంది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మురుగు వ్యర్థాలు రహదారులపై దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామంలోని వీధులు చెత్తాచెదారం గుట్టలకు నిలయంగా, దోమల వృద్ధి కేంద్రాలుగా మారాయి. చెత్తాచెదారం నిండుకున్న రహదారుల వెంట రాకపోకలు సాగించాలంటే దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని వీడి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉయ్యూరు రూరల్



గండిగుంట ప్రధాన రహదారి పక్కన దుస్థితి

## రోడ్డుపై డ్రెయినేజీ మురుగు

కంకిపాడు: డ్రెయిను మురుగు రోడ్డుపైకి ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడాన్ని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పట్టణంలోని పోలీసుస్టేషన్కు సమీపంలోని ప్రధాన డ్రెయిన్ నుంచి మురుగు పొంగి ప్రధాన రహదారి మార్గం వైపు ప్రవహిస్తోంది. కొద్ది రోజులుగా ఇదే విధంగా జరుగుతుంది. ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు మురుగుతో ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర దుర్గంధం వెలువడి అవస్థలు ఎదుర్కొంటున్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.



రోడ్డుపైకి వస్తున్న డ్రెయినేజీ మురుగు